# 8న బీఆర్ఎస్ మండల సమావేశం

రాయపోల్‌లో మాట్లాడుతున్న కృపేశ్, బుగ్గరాములు తదితరులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5 : బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 8న ఇబ్రహీంపట్నంలో మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీపీ కృపేశ్, పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రాయపోల్, దండుమైలారం, ముకునూరు, పోల్కంపల్లి, నాగన్‌పల్లి, నెర్రపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 8న నిర్వహించే సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

షాబాద్‌లో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

షాబాద్, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ ఎంతో కృషి చేశారని ఎమ్మార్పీస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించడంపై బుధవారం షాబాద్‌లో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే షాబాద్ నుంచి నాగరగూడ వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ సమావేశం నిర్వహించి ఈ నెల 7న నిర్వహించే ఎమ్మార్పీస్ మహాప్రదర్శన కార్యక్రమంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశం

చేవెళ్లటౌన్/చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 5 : మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశం హెచ్చరించారు. బుధవారం చేవెళ్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా 12 వాహనాలు, ముగ్గురు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడడంతో మొత్తం 15 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్సీలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**బీఆర్ఎస్ పార్టీ యాచారం మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్**

సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

యాచారం, ఫిబ్రవరి 5 : ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఎన్నికల ముందిచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్ పెంచుతామని చెప్పి వృద్ధులు, దివ్యాంగులను మభ్యపెట్టారని అధికారం చేపట్టి ఏడాది గడిచినా నేటికీ పింఛన్ పెంచకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కల్యాణలక్ష్మి తులం బంగారం ఎక్కడికీ పోయిందని ప్రశించారు. రెండు పంటలకు రైతుభరోసా డబ్బులను ఎందుకివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు రూ.2500 ఏమైందని, గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి పథకాలు కొందరికే పరిమితమయ్యాయన్నారు. ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి నాలుగు పథకాలపై ప్రచారం చేసి, చివరగా మండలానికి ఒకే గ్రామానికి వర్తించేలా చేయడం, అందులో అర్హులకు మొండిచేయి చూపడం తగదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు అర్హులందరికీ వర్తించేలా చూడాలన్నారు. బీఆర్ఎస్ నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నివాసానికి పనికి రావని చెప్పిన కాంగ్రెస్ నాయకులు నేడు అవే ఇండ్లకు మూడు రంగులు వేసి పంపిణీ చేయాలనుకోవడం సిగ్గు చేటన్నారు. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ఉద్యమాలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రతీ కార్యకర్త ఓ సైనికుడిలా పని చేయాలి

మండల పరిధిలో బీఆర్ఎస్‌ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతీ కార్యకర్త ఓ సైనికుడిలా కృషి చేయాలని రమేశ్‌గౌడ్ అన్నారు. ఈ నెల 9న మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిశన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాచ్చ భాష, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కారింగు యాదయ్య, నాయకులు ఓరుగంటి యాదయ్యగౌడ్, లిక్కి నరసింహారెడ్డి, శంకర్‌నాయక్, హబీబుద్దీన్, రమావత్ జగదీశ్, సత్యపాల్, ఖాజా మహ్మద్, మండలి గోపాల్, బొల్లంపల్లి వెంకటేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

# సీఎం సహాయ నిధి పేదలకు వరం

మాడ్గుల, ఫిబ్రవరి 5 : సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని బీఆర్ఎస్ నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్ కల్లు రాజావర్ధన్ రెడ్డి, కలకొండ మాజీ సర్పంచ్ గొర్రె పవన్ కుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కలకొండ గ్రామానికి చెందిన డొంకి రాముకు రూ.25 వేలు, డొంకి బాలమణికి రూ.28 వేలు రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. వాటిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం వారు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐజాక్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 5 : మండల పరిధిలోని తంగడిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం గ్రామానికి చెందిన వడ్డె చంద్రయ్య ఆలయ నిర్మాణం కోసం రూ.51 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అంజేశారు. ఈ సందర్భంగా వడ్డె చంద్రయ్యను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనూషాసత్తయ్యగౌడ్, రాములు గౌడ్, చంద్రయ్య గౌడ్, సుధాకర్‌గౌడ్, నారాయణరెడ్డి, ఎం.రవీందర్‌గౌడ్, ఎం.శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న వడ్డె చంద్రయ్య

# ఆడపిల్లలు తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలి

చేవెళ్ల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మాలతి

మొయినాబాద్, ఫిబ్రవరి 5 : స్వయం ఆత్మరక్షణ కోసం ప్రతి ఆడపిల్ల కరాటే నేర్చుకోవాలని చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాలతి అన్నారు. మండల పరిధిలోని తోలుకట్టా గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులు కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వికారాబాద్‌లో జరిగిన 6వ కరాటే జాతీయ ఓపెన్ చాంపియన్ షిప్-2 పోటీలను మాస్టర్ జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల, కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 8 మంది విద్యార్థినులు బంగారు పతకాలు, 16 మంది సిల్వర్ పతకాలు, 24 మంది కాంస్య పతకాలను సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చడానికి కరాటే మాస్టర్ రాము కృషి అభినందనీయమని, పతకాలు సాధించిన వారిని అభినందించారు.

# మార్చి 29న కవి సమ్మేళనం

సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 5: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ గ్రేడ్-1 గ్రంథాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మార్చి 29న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ.. కవిత్వంపై పట్టు ఉన్న కవులను వెలికి తీసేందుకు, షాద్‌నగర్ నియోజకవర్గంలోని వారికి మాత్రమే ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారు మార్చి 15లోపు తమ పేర్లను, స్వీయ కవిత్వాన్ని నమోదు చేసుకోవాలని, 20న స్వీయ కవితలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారు మాత్రమే కవి సమ్మేళనంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని కవులందరూ సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు గ్రంథాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు బాల్‌రాజ్, వీరేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు చంద్రశేఖర్, అనిల్, రవీందర్, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, రాజు, శ్రీకాంత్, రాజేశ్, రవినాయక్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కొత్తూరు : విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

కొత్తూరు, జనవరి 5 : విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలనే ఉద్దేశంతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామని రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి అన్నారు. మామిడి సత్యనారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని పెంజర్లలో ఉన్న జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చాలామంది గుండె పోటుతో చనిపోతుండడంతో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించామన్నారు. అలాగే కంటి పరీక్షలు నిర్వహించామని వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు సభ్యుడు, రెడ్ క్రాస్ సీపీఆర్ కోఆర్డినేటర్ రవి హీలియన్, ఆస్పత్రి ఎండీ విజయభాస్కర్‌గౌడ్, రిటైర్డ్ జడ్జి సుప్రీంకోర్టు న్యాయవాది నేరెళ్ల మల్యాద్రి, ప్రధానోపాధ్యాయుడు ప్రసన్నా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**కొహెడ పాఠశాలలో..**

**తుర్కయాంజాల్ :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని కొహెడ ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం దన్నె రాజు అన్నారు. బుధవారం ఆ పాఠశాల ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ సొంత డబ్బులతో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్ : విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయుడు విజయ్ కుమార్

# పేదవిద్యార్థుల సంక్షేమానికి కృషిచేయాలి

పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అక్షయమూర్తి తెలిపారు. రాచలూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు కమ్యూనిటీ సోషల్ ఆక్టివిటీస్ కింద రూ.30వేలతో అల్మారాలను విరాళంగా ఇచ్చి, వాటిని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవేందర్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ కరుణాకర్, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. - కందుకూరు

# చెడు వ్యసనాలకు లోనుకావొద్దు

మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఏసీబీ రాజు

కందుకూరు, ఫిబ్రవరి 5 : యువత చెడు వ్యసనాలకు లోనుకావొద్దని ఇబ్రహీంపట్నం ఏసీబీ రాజు తెలిపారు. ఆకులమైలారం గ్రామంలో అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. ఆన్‌లైన్ గేములు, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు లోను కావద్దని కోరారు. చెడు అలవాట్లకు లోనై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. పేకాట, జూదం ఆడవద్దని, ఆపద సమయంలో 100కు ఫోన్ చేయాలని సూచించారు. యువకులను ప్రభుత్వ సహకారంతో ఆర్థికంగా ఎదుగాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ ఎస్సై తేజంరెడ్డి, గొరిగే రాజు, పాండు, పోలీస్‌సిబ్బంది, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేటి నుంచి రాకపోకలు నిలిపివేత

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 5 : షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి రైల్వే ట్రాక్ వద్ద మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వాహనదారులు వేరే మార్గం ద్వారా రాకపోకలను కొనసాగించాలన్నారు. మరమ్మతుల కారణంతో వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నామని, వాహనదారులు సహకరించాలన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వాంక్డావత్ రాజు (ఫైల్)

కేశంపేట, ఫిబ్రవరి 5 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పుట్టోనిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కంకిరాళ్లతండాకు చెందిన వాంక్డావత్ రాజు (38) వ్యక్తిగత పనిమీద బైక్‌పై వేముల్‌నర్వకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తండాకు వస్తుండగా కోమటికుంట చెరువు వద్ద ఎలాంటి సిగ్నల్స్ లేకుండా నిర్లక్ష్యంగా నిలిపి ఉన్న నీటి ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో రాజు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరహరి తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు సంతానం ఉన్నారు.

# పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

యాదయ్య (ఫైల్)

మాడ్గుల, ఫిబ్రవరి 5 : మండల పరిధిలోని కొల్కులపల్లి గ్రామానికి చెందిన పోలే యాదయ్య (50) బుధవారం పురుగుల మందు తాగి మృతి చెందినట్లు సీఐ వేణుగోపాల రావు తెలిపారు. యాదయ్యకు ఇద్దరు సంతానం. కొడుకు, కూతురు గతంలో మృతి చెందారు. యాదయ్య కొల్కులపల్లి వీఆర్ఏగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మాడ్గుల తహసీలార్ కార్యాలయంలో కూడా విధులు నిర్వహించినట్లు తెలిపారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 5: హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే మహా ప్రదర్శనకు అధిక సంఖ్యలో తరలిరావాలని బుధవారం చేవెళ్లలో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో వంద డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రాం, మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య డప్పుదరువు వేసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి వృథా.. పట్టదా!

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 5: చుక్కనీటిని కూడా వృథా చేయొద్దు.. ఏ ఒక్కరికి నీటి ఇబ్బంది రాకుండా చూడాలంటూ.. ఉన్నతాధికారులు నిత్యం సమీక్షల్లో ఆదేశాలు జారీ చేస్తున్నా.. కిందిస్థాయి సిబ్బంది మాత్రం ఆ మాటలను పెద్దగా పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం చౌరస్తా నుంచి హనుమాన్‌నగర్ కాలనీకి వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. నెలరోజులుగా నీళ్లు వృథాగా పోతున్నాయి. అయినా, ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. లీకేజీ పెద్దదిగా మారకముందే అధికారులు స్పందించకపోతే తాగునీటి కష్టాలు తప్పవని స్థానికులు మండిపడుతున్నారు.

# బంగారు పుస్తెల గొలుసు అపహరణ

ఆదిబట్ల, ఫిబ్రవరి 5 : ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెల గొలుసు ఎత్తు కెళ్లిన ఘటన బుధవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తుర్కయాంజాల్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన పుల్లగుర్రం అనసూయ ఇంట్లో ఉండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెల గొలుసును ఎత్తుకెళ్లాడు. వెంటనే అనసూయ.. కొడుకు వ్యవసాయ బావి వద్ద ఉండడంతో ఏడుస్తూ ఫోన్ చేసి విషయం చెప్పింది. అప్పటికే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత

- మైనింగ్ అధికారులకు అప్పగించిన ఆదిబట్ల పోలీసులు
- అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు
- ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఆదిబట్ల, ఫిబ్రవరి 5: ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక జేసీబీని ఆదిబట్ల పోలీసులు పట్టుకున్నారు. వాటిని మైనింగ్ అధికారులకు అప్పగించారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అనుమతి లేకుండా కొంత మంది ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. వారిపై నిఘా పెంచామన్నారు. ఇప్పటికైనా మట్టి తరలింపునకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీని స్వాధీనం చేసుకున్న పోలీసులు

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



కందుకూరు కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 5 : స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. పోలింగ్‌బూత్‌ల్లో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బుధవారం తన కార్యాలయంలో కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఎచ్ఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణతో కలిసి మాట్లాడుతూ.. పోలింగ్‌బూత్‌ల్లో ఏర్పాట్లు, వసతులు కల్పించాలని, ఓటర్ లిస్టుల్లో పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు ర్యాంపుల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్, కల్పించాలన్నారు.

ఎన్నికల సిబ్బందిని నియమించాలని, శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించడానికి కృషి చేయాలని కోరారు. ఏ క్షణంలోనైన నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు గోపాల్, నాయబ్ తహసీల్దారు శేఖర్, ఎంపీడీఓ సరిత, పాల్గొన్నారు.

# లక్ష్మీగూడలో కార్డన్ సర్చ్

లక్ష్మీగూడ వాంబే కాలనీలో దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 5: కార్డన్ సర్చ్‌ల ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. బుధవారం రాత్రి లక్ష్మీగూడ వాంబే కాలనీలో కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ చేపట్టారు. జనావాసాల ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి వారి వాహనాలను సీజ్ చేశారు. దుకాణాల్లో చేపట్టిన తనిఖీల్లో నిషేధిత గుట్కాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలను నియంత్రించేందుకు స్టేషన్ పరిధిలో కార్డన్ సర్చ్‌లను చేపడుతున్నామన్నారు. సరైన దస్తావేజుల లేని వాహనాలను గుర్తించి సీజ్ చేసి స్టేషన్‌కు తరలిస్తున్నామన్నారు. ఇండ్లల్లోకి అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలను తీసుకున్న తర్వాతనే యజమానులు అద్దెకు ఇవ్వాలన్నారు. ప్రతి ఇంటితో పాటు కాలనీల ప్రధాన రోడ్లపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.